
సాక్షి ఒడిశా

ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ. 5,73,376
బంగారం 6 గ్రాముల 890 మిల్లీ గ్రాములు
వెండి 82 గ్రాముల 100 మిల్లీ గ్రాములు

-భువనేశ్వర్/పూరీ



నాట్య సమ్మోహనం

ధౌలి- కళింగ మహోత్సవం ఉత్సాహంగా సాగుతోంది. కథక్, ఒడిస్సీ, చౌ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి.

- 8లో.



సంక్షేమ పథకాలపై అవగాహన

ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అమొ ఒడిశా నవీన ఒడిశా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జాగా మిషన్ అధికారి హరిశంకర రౌత్ తెలిపారు.

- 8లో.

న్యూస్‌రీల్

రాష్ట్ర సమాచార కమిషనర్‌గా జగన్నాథ రథ్



ప్రమాణ స్వీకారం చేస్తున్న జగన్నాథ రథ్

భువనేశ్వర్: రాష్ట్ర కొత్త సమాచార కమిషనర్‌గా జగన్నాథ రథ్ శనివారం ప్రమాణస్వీకారం చేశారు. స్థానిక రాజ్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్ సమక్షంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు.

బంజరగర్ రాణా అధికారిగా కుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న కుమార్

బరంపురం: గంజాం జిల్లా బంజరగర్ పోలీసుస్టేషన్ ఐఐసీ అధికారిగా కుమార్ ముద్దిలీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కొంధమాల్ జిల్లా కె.నువాగం పోలీసుస్టేషన్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

16న అఖిల భారత శ్రామికుల బంద్



సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల నేతలు

జయపురం: ఈ నెల 16న అఖిల భారత్ శ్రామికుల బంద్ విజయవంతం చేయాలని కార్మిక నేత ప్రమోద్‌కుమార్ మహంతి పిలుపునిచ్చారు. శుక్రవారం జయపురంలోని కార్మిక భవనంలో నిర్మించిన కార్మిక నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల, నిరుద్యోగం, కార్మిక చట్టాల రద్దు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 16న జాతీయ స్థాయిలో ఆందోళనకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని చెప్పారు. సమావేశంలో జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి జుధిష్టర్ రౌళో, దండపాణి పాత్రో, ఆర్.ఎస్.పట్నాయక్, రామకృష్ణదాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి తాళం



నిరసన తెలియజేస్తున్న గ్రామస్తులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మర్కపల్లి పంచాయతీ బుట్టిగూడ అంగన్‌వాడీ కేంద్రంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు శనివారం తాళం వేశారు. చిన్నారులకు, గర్భిణులకు సకాలంలో గుడ్లు, ఇతర పోషక పదార్థాలు అందజేయకుండా అంగన్‌వాడీ సిబ్బంది దోచుకుంటున్నారని ఆరోపించారు. తక్షణమే వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

తమిళనాడులో కాశీపూర్ కార్మికుడు మృతి



మదన్ గౌడొ మృతదేహం

రాయగడ: తమిలనాడులో కాశీపూర్‌కు చెందిన వలస కార్మికుడు మృతి చెందాడు. సమితిలోని తొలొజిరి పంచాయతీ రాసిరిఖిరి గ్రామానికి చెందిన మదన్ గౌడొ(25) దివ్యాంగుడు. ఉపాధి కోసం ఆరు నెలల కిందట తమిళనాడులోని ఓ ప్రయివేట్ కంపెనీలో రోజు కూలీగా చేరాడు. అక్కడ సంపాదించిన కొంత మొత్తాన్ని కుటుంబానికి ప్రతి నెలా పంపిస్తుండేవాడు. ఏం జరిగిందో గానీ మదన్ మృతి చెందిన భార్య, ఇద్దరు పిల్లలకు శుక్రవారం సమాచారం వచ్చింది. దీంతో వారు విషాదంలో మునిగిపోయారు. వెంటనే రాయగడలోని జిల్లా కార్మిక కార్యాలయానికి సమాచారం అందించడంతో కార్మిక శాఖ అధికారి జాస్మిన్ సాహు తమిళనాడులోని కంపెనీ యాజమాన్యంతో చర్చించారు.

ముగిసిన 'సుజ్ఞాన'శకం

- 'కళ్లికోట రాణి', ఎమ్మెల్యే సుజ్ఞానకుమారి దేవ్ అస్తమయం
- చెన్నైలో చికిత్స పొందుతూ మృతి
- వరుసగా పది సార్లు శాసన సభ్యురాలిగా విజయం
- మంత్రి పదవులు కాదని నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పాలన



చెన్నైలోని ప్రైవేట్ ఆసుపత్రిలో సుజ్ఞానకుమారి దేవ్ భౌతికకాయం,(ఇన్‌సెట్లో) సుజ్ఞాన కుమారిదేవ్(ఫైల్)

బరంపురం/భువనేశ్వర్: ఒడిశా ప్రజల ప్రియతమ నాయకురాలు, దీర్ఘకాలిక ప్రజా ప్రతినిధి (ఎమ్మెల్యే), కళ్లికోట రాణిగా మన్ననలు అందుకున్న సుజ్ఞాన కుమారి దేవ్ (87) కన్నుమూశారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి 2 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. అధికార పార్టీ బీజేడీకి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆమె 2019 ఎన్నికల్లో గంజాం జిల్లా కవిసూర్యనగర్ శాసనసభ సభ్యురాలిగా పోటీ చేసి ఏకంగా 10వ సారి విజయం సాధించి ఒడిశా రాష్ట్రంలో రికార్డు సృష్టించారు. సుజ్ఞానదేవి మృతితో ఒడిశా ప్రజలు విషాదంలో మునిగిపోయారు.

గంజాం జిల్లా తిరుగు లేని నాయకురాలు..

సుజ్ఞానకుమారి దేవ్ తొలిసారిగా 1961లో గంజాం జిల్లా ఖల్లికోట్ నియోజకవర్గం నుంచి రాష్ట్ర శాసన సభకు ఎన్నికయ్యారు. 2014లో కవిసూర్యనగర్ నియోజకవర్గం నుంచి చివరిసారిగా గెలుపొందారు. బిజూ జనతా దళ్ అభ్యర్థిగా ఖల్లికోట్ స్థానం నుంచి 8 సార్లు, కవిసూర్యనగర్ నియోజకవర్గం నుంచి రెండు సార్లు శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత ఖల్లికోట్ షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) అభ్యర్థులకు రిజర్వ్ చేశారు. ఈ పరిస్థితిలో 2014లో జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గం మారారు. కవిసూర్యనగర్ నుంచి చివరి ఎన్నికల్లో పోటీ చేసి విజేతగా నిలిచి తిరుగు లేని నాయకురాలుగా చరిత్ర లిఖించారు. 3వ, 6వ, 7వ, 9వ, 10వ, 11వ, 12వ, 13వ, 14వ, 15వ అసెంబ్లీకి ఎమ్మెల్యేగా కొనసాగారు. ప్రోటెం స్పీకర్‌గా నియమితులయ్యారు. మంత్రి పదవి కోసం పలుమార్లు ప్రతిపాదనలు చేరువైనా ఆమె నిరాకరించి ప్రజా సేవలో విభిన్న శైలిని చాటుకున్నారు.



కళ్లికోట్‌లోని సుజ్ఞానకుమారి దేవ్ ప్యాలెస్

రాజ వంశీకురాలు..

ఖల్లికోట్ రాజకుటుంబానికి చెందిన ఈమె స్వస్థలం చెన్నై. ఖల్లికోట్ పూర్ణ చంద్ర మర్దరాజ్ దేవ్‌తో వివాహం జరగడంతో రాజా రామచంద్ర మర్దరాజ్ దేవ్ వంశంలో కోడలిగా రాష్ట్రంలో అడుగుపెట్టారు. 1936 ఏప్రిల్ 1న భాషా ప్రాతిపదికన ప్రత్యేక ఒడిశా రాష్ట్ర ఏర్పాటు కావడంలో రాజా రామచంద్ర మర్దరాజ్ దేవ్ ముఖ్యమైన పాత్ర పోషించారు. రాష్ట్ర శాసన సభలో స్పీకర్ కుర్చీని ఖల్లికోట్ రాజకుటుంబం విరాళంగా ఇచ్చిందే.



బరంపురం తెలుగు ప్రజలతో విడదీయరాని అనుబంధం(ఫైల్)

అభివృద్ధే విజయ రహస్యం..

'మాజీ సీఎం బిజు పట్నాయక్ నుంచి ప్రస్తుత తనయుడు నవీన్ పట్నాయక్ వరకు వరుసగా 10 సార్లు విజయం సాధించాను. నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పనిచేయడమే నా విజయరహస్యం. పాఠశాలలు, కళాశాలలు, తాగునీరు, రహదారులు, వసతి గృహాలు, ఆస్పత్రులు, కమ్యూనిటీ హాల్స్, వ్యవసాయ ప్రాజెక్టులు వంటి ఎన్నో పనులు చేశాను. నా రాజకీయ జీవితంలో బిజు, నవీన్ మంత్రి మండళ్లలో ఎన్నో సార్లు మంత్రి పదవులు వరించి వచ్చినా కాదన్నాను. మంత్రి పదవి వస్తే నా నియోజకవర్గానికి పూర్తిస్థాయిలో న్యాయం చేయలేనని భావన. అందుకే ఏ రోజు మంత్రి పదవి ఆశించలేదు..' అంటూ గతంలో 'సాక్షి'కి తెలియజేశారు.

గవర్నర్, సీఎం సంతాపం

భువనేశ్వర్: రాష్ట్ర రాజకీయాల్లో ప్రముఖ నాయకురాలుగా నిలిచిన సుజ్ఞాన కుమారి దేవ్ మృతి పట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. రాష్ట్ర గవర్నర్ రఘుబర్ దాస్, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, ఛత్తీస్‌గఢ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, పలువురు నాయకులు సంతాపం తెలియజేశారు.బిజూ జనతా దళ్ సీనియర్ నాయకురాలిగా పార్టీ నిర్వహణలో ఆమె కీలకపాత్ర పోషించారని, 10 సార్లు ఖల్లికోట్, కవిసూర్యనగర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహించి ప్రజా సేవలో ప్రత్యేక ముద్ర వేశారని, ఆమె మరణం తీరని లోటని సీఎం నవీన్ పేర్కొన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అంతకుముందు శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ చెన్నైలో సుజ్ఞాన కుమారి దేవ్ చికిత్స పొందుతున్న ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను కలిశారు.



చెన్నై ఆస్పత్రిలో సుజ్ఞాన కుమారి దేవ్ కుటుంబీకుల్ని పరామర్శించిన ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

తుదివీడ్కోలు పలికిన ముఖ్యమంత్రి

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభ మాజీ సభ్యురాలు, కల్లికోట రాణి వి.సుజ్ఞానకుమారి దేవ్‌కు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తుది వీడ్కోలు పలికారు. చెన్నై ప్రైవేటు ఆసుపత్రి నుంచి స్థానిక శంఖభవన్ (బీజేడీ రాష్ట్ర కార్యాలయం)కు శనివారం రాత్రి ఆమె పార్థివ దేహం ప్రత్యేక వాహనంలో చేరింది. ఈ సందర్భంగా బీజేడీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పుష్ప గుచ్ఛం సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం విశేష సంఖ్యలో ఆమె అనుచరులు, అభిమానులు, తోటి శాసన సభ్యులు దివంగత సుజ్ఞాన కుమారి దేవ్‌కు శ్రద్ధాంజలి ఘటించి వీడ్కోలు పలికారు.

బీజేడీ పార్టీ సంతాపం..

పర్లాకిమిడి: కల్లికోట రాణి, ఎమ్మెల్యే సుజ్ఞాన కుమారి దేవ్ మృతి పట్ల పర్లాకిమిడి బిజూ జనతా దళ్ పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. మార్కెట్ వద్ద పార్టీ కార్యాలయంలో బరంపురం ఎంపీచంద్రశేఖర సాహు, సీనియర్ నాయకులు బసంత్‌దాస్, రాష్ట్ర బీజేడీ సాధారణ కార్యదర్శి ప్రదీప్‌నాయక్, జిల్లా బీజేడీ అధ్యక్షుడు జగబంధు దాస్ తదితరులు సంతాపం తెలియజేశారు.



సుజ్ఞాన కుమారిదేవ్ పార్థివ దేహంపై పుష్పగుచ్ఛం ఉంచి వీడ్కోలు పలుకుతున్న సీఎం నవీన్ పట్నాయక్

జనజీవన స్రవంతిలో కలవండి

- అభివృద్ధికి నాంది పలకండి
- నియమగిరి పర్వత ప్రాంతాల్లో మావో వ్యతిరేక పోస్టర్లు



మావోయిస్టుల వ్యతిరేక పోస్టర్

రాయగడ: జిల్లాలోని కళ్యాణ సింగుపూర్ సమితి నియమగిరి పర్వత ప్రాంతాల్లో శుక్రవారం మావోయిస్టుల వ్యతిరేక పోస్టర్లు దర్శనమిచ్చాయి. మారణాయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిసి అభివృద్ధికి నాంది పలకాలంటూ ఆ పోస్టర్లలో పేర్కొన్నారు. సంవృద్ధి ఒడిశా పేరిట వెలసిన ఈ పోస్టర్లలో మావోయిస్టు నాయకులైన నిఖిల్ ఉరఫ్ శివాజి, ప్రకాష్ ఉరఫ్ నిరంజన్ రౌత్, అంకితా ఉరఫ్ ఇందు ఓరఫ్ రస్మిత లెంకలు హింసను వీడి శాంతియుత వాతావరణంలోకి అడుగుపెట్టాలని పిలుపునిచ్చారు. ఒడిశా శాంతియుతమైన రాష్ట్రమని వివరించారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ వంటి రాష్ట్రాల్లోని మావోయిస్టుల ప్రభావం ఒడిశాపై పడిందని పేర్కొన్నారు. అక్కడి పోలీసుల భయంతో తలదాచుకునేందుకు ఇక్కడికి వచ్చిన మావోయిస్టులు క్రమేపీ ఒడిశా రాష్ట్రాన్ని మావో ప్రభావిత ప్రాంతంగా మార్చివేశారని చెప్పారు. వారి కార్యకలాపాలు విస్తరించేందుకు అమాయక ఆదివాసీలను పావులుగా వాడుకోవడం పరిపాటిగా మారిందన్నారు. కాగా, నియమగిరి పర్వత ప్రాంతాలైన డొంగిరియాలు గ్రామాల్లో కనిపించిన ఈ పోస్టర్లపై అతికించిన వారి పేర్లు స్పష్టంగా లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

సోనియాను కలిసిన ఎంపీ ఉల్క



సోనియా గాంధీతో సప్తగిరి ఉల్క

కొరాపుట్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీని కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క శని వారం పార్లమెంట్ భవనం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఒడిశా రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి ఉల్క ఒక్కరే ఎంపీగా కొనసాగుతున్నారు. గాంధీ కుటుంబానికి ఉల్క కుటుంబం దశాబ్దాలుగా విశ్వసనీయంగా ఉంటోంది. అందుకే ఉల్కను ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా నియమించారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్రంలో పార్టీ పరిస్థితిని ఉల్క వివరించారు.

ఖేల్ ఇండియా కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎంపీ రమేష్

కొరాపుట్: కేంద్ర క్రీడా, యువజన సర్వీసుల మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్‌ను నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్ చంద్ర మజ్జి శనివారం పార్లమెంట్ భవనం వద్ద మంత్రి చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ నియోజకవర్గంలో రెండు జిల్లాల కేంద్రాలైన నబరంగ్‌పూర్, మల్కన్‌గిరి పట్టణాల్లో ఖేల్ ఇండియా కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన విద్యార్థుల్లో క్రీడాసక్తి పెంపొందించేందుకు ఈ కేంద్రాల ఏర్పాటు ఎంతో అవసరమని చెప్పారు.

రేషన్‌కార్డుదారులకు జూట్‌బ్యాగుల పంపిణీ

రాయగడ: రేషన్ కార్డు లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం సరుకులు తీసుకువెళ్లేందుకు ఉచితంగా జూట్ బ్యాగ్‌ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. శనివారం రాయగడ సమితి కెరడ పంచాయతీలో సమితి ఉపాధ్యక్షుడు హరప్రసాద్ హెప్రుక లబ్ధిదారులకు సంచులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో ఇదొకటని చెప్పారు. ప్రతి కార్డుదారునికి రెండు జూట్ బ్యాగులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.



బ్యాగులు పంపిణీ చేస్తున్న హరప్రసాద్

కాంగ్రెస్ గూటికి నటుడు మనోజ్ మిశ్రా



ఓపీసీసీ చీఫ్ శరత్ పట్నాయక్‌తో మనోజ్ మిశ్రా

భువనేశ్వర్: ఒడియా చలన చిత్ర నటుడు మనోజ్ మిశ్రా శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈయన నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా పూర్వ విద్యార్థి. స్థానిక కాంగ్రెసు భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి డాక్టర్ అజోయ్‌కుమార్, ఒడిశా ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్, సీనియర్ నాయకుడు నరసింగ మిశ్రా సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మిశ్రా మాట్లాడుతు సీనియర్ నాయకుడు నరసింగ మిశ్రా స్ఫూర్తితో కాంగ్రెస్‌లో చేరినట్లు పేర్కొన్నారు. తన జీవనోపాధి అయిన సినిమాల్లో పనిచేస్తూనే రాజకీయాల్లో కొనసాగుతానని స్పష్టం చేశారు. పశ్చిమ ఒడిశాలో ప్రబలంగా ఉన్న కార్మికుల వలస సమస్యను పరిష్కరించేందుకు, ప్రజలకు సేవ చేసేందుకు కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు వివరించారు. కాగా, పశ్చిమ ఒడిశాకు ప్రాతినిధ్యం యోచనలో మనోజ్ మిశ్రా ఉన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థిని ఆత్మహత్య



ఉరి వేసుకున్న సంధ్యారాణి, (ఇన్‌సెట్లో) సంధ్యారాణి (ఫైల్)

కొరాపుట్: ఒడిశా సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. కెంద్రపడా జిల్లాకు చెందిన సంధ్యా రాణి దాస్(23) కొరాపుట్ జిల్లా సునాబెడా సమీపంలోని యూనివర్సిటీ హాస్టల్‌లో బి-413 గదిలో ఉంటూ యూజీ విభాగం(గణితం) ప్రథమ సంవత్సరం చదువుతుతోంది. ఏం జరిగిందో గానీ తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శనివారం ఉదయం ఎంత సేపైనా గది తెరవకపోవడంతో తోటి విద్యార్థులు తలుపులు గట్టి తీయగా విగత జీవిగా కనిపించింది. వెంటనే సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలపై ఆరా తీశారు.

కిరాణా షాపు దగ్ధం

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని దుర్గగుడివీధిలో శనివారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా కిరాణా షాపు దగ్ధమైంది. దుకాణం, ఇల్లు ఒకటే కావడంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలిపోయారు. అగ్నిమాపిక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కాలిపోయిన దుకాణం

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాల పంట



పతకాలతో కిశోర్ చంద్ర రథ్

పర్లాకిమిడి: గోవాలో ఈ నెల 8 నుంచి 13 వరకూ జరిగిన జాతీయ సూపర్ మాస్టర్స్ గేమ్స్, స్పోర్ట్స్ ఫెడరేషన్ పోటీల్లో గజపతి జిల్లాకు చెందిన కిశోర్ చంద్ర రథ్‌కు లాంగ్ జంప్ విభాగంలో స్వర్ణం, హైజంప్‌లో రజతం, ట్రిపుల్ జంప్‌లో స్వర్ణ పతకం సాధించారు. గోవాలో బంబోలియం స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో 23 మంది పాల్గొనగా భువనేశ్వర్‌కు చెందిన పార్వతీ సెఠీకి ఒక స్వర్ణం, విశ్రాంత ఎక్సైజ్ ఎస్ఐ కిశోర్ చంద్ర రథ్‌కు రెండు స్వర్ణాలు, రజత పతకం సాధించారు. ఈయన గతంలో నేపాల్, ఇతర రాష్ట్రాల్లోనూ పలు పతకాలు సాధించి అంతర్జాతీయ ఖ్యాతి అర్జించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, జిల్లా స్పోర్ట్స్ అధికారి ప్రాణక్రిష్ణ పాణిగ్రాహి శనివారం కిశోర్‌చంద్రకు అభినందనలు తెలిపారు.

నులిపురుగులను నివారిద్దాం



రాయగడ: విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందు వేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: ఆరోగ్యకరమైన అలవాట్లతో నులి పురుగులను నివారించవచ్చని జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ కుమార్ పాత్రో అన్నారు. స్థానిక సరస్వతీ శిశు విద్యామందిర్‌లో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా చిన్నారులతో నులి పురుగుల నివారణ మందు అందజేశారు. కార్యక్రమంలో అదనపు జిల్లా మేజిస్ట్రేట్ జ్యోతి, జిల్లా స్వస్థ్య అధికారి నేత్రానంద శతపథి, ఏ.డి.పి.ఎ.ఓ. మహేంద్రకుమార్ భుయ్యాన్, డి.పి.ఎం. సౌమ్య రాణి గౌడో, ప్రధాన ఆచార్యులు సరోజ్‌కుమార్ పండా పాల్గొన్నారు.

- రాయగడ: అప్రమత్తత, సకాలంలో మందులు వాడితే రోగాల నుంచి బయటపడవచ్చని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అన్నారు. శనివారం సదరు సమితి పరిధిలోని బాకురుగుడ ఆశ్రమ పాఠశాలలో నులి పురుగులు, ఫైలేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందు వేశారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్‌మోహన్ రౌత్రాయ్, ప్రజారోగ్య అధికారి డాక్టర్ వి.లోక్‌నాథ్‌రాజు, జిల్లా విద్యాశాఖ అధికారి పూర్ణచంద్ర భోరియా పాల్గొన్నారు.



పర్లాకమిడి: విద్యార్థులకు నివారణ మందు వేస్తున్న సీడీఎంఓ ప్రదీప్‌కుమార్ పాత్రో

క్లుప్తంగా

బీజేపీ నేత నిరశన దీక్ష



రామ్ పాత్రోకు చికిత్స అందిస్తున్న వైద్యులు

బరంపురం : దక్షిణ ఒడిశా ప్రజల ఆరోగ్య ప్రదాత ఎంకేసీజీ ఆస్పత్రిలో వార్మ్ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ నాయకుడు రామ్‌పాత్రో శనివారం హాస్పిటల్ ఆవరణలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వైద్యులు చికిత్స అందించారు.

ఆరుగురు జూదరుల అరెస్టు



అరెస్టయిన వారితో పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లా ఎం.వి-7 గ్రామం వద్ద జూదమాడుతున్న ఆరుగురిని మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్ కీండో శనివారం అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.48,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో సుధారామ్ మండాళ్, దిలీప్ భోక్తో, విర్దార్ మడ్కమి, డి.కవాసి, మనేంద్రదేవ్, బిజన్ మాలి ఉన్నారు. మరికొందరు పరారయ్యారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని కీండో తెలిపారు.

బొల్లినేనిలో నూతన కోర్సులు ప్రారంభం

శ్రీకాకుళం రూరల్: రాగోలులోని జెమ్స్ ఆస్పత్రి అనుబంధ బొల్లినేని మెడిస్కిల్స్ నందు హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో నడుస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో బ్యూటీషియన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, పదోతరగతి అర్హతతో మూడు నెలలు కోర్సులో అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వయస్సు 18 నుంచి 28 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 7680945357, 9121999654 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఖతార్‌లో వలస కూలీ మృతి



బుడ్డెపు గున్నయ్య

కంచిలి: మండలంలోని ఎక్కల పంచాయతీ పరిధి అర్జునాపురం గ్రామానికి చెందిన బుడ్డెపు గున్నయ్య(53) ఖతార్‌లో శుక్రవారం సాయంత్రం మృతిచెందారు. ఆయన ఇటీవల దసరాకు ఇంటికి వచ్చి ఖతార్ వెళ్లారు. అక్కడి కన్‌స్ట్రక్షన్ కంపెనీలో రిగ్గర్‌గా పనిచేస్తుండేవారు. పనిచేస్తున్న ప్రదేశంలో గుండె నొప్పి రావడంతో స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయనకు భార్య కిరామణి, ముగ్గురు కుమార్తెలు ధనలక్ష్మీ, గీతాంజలి, నీలవేణి ఉన్నారు. ఇంతవరకు పిల్లలకు వివాహాలు కాలేదు. మార్చి నెలలో రెండో కుమార్తె గీతాంజలి వివాహం జరగనుంది. ఇంతలోనే ఈ ఘోరం జరిగిందని కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. రెండు రోజుల్లో గున్నయ్య మృతదేహం స్వగ్రామానికి చేరుతుందని గ్రామస్తులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కాశీబుగ్గ: పలాస జాతీయ రహదారి కోసంగిపురం కూడలి వద్ద శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టడంతో మందస మండలం కొండలోగాం గ్రామానికి చెందిన సవర దివాకర్, సవర వెన్నెలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో అదే రూట్‌లో ప్రయాణిస్తున్న సోంపేట జెడ్పీటీసీ తడక యశోద, పలాసపురం గ్రామ సర్పంచ్ తడక జోగారావు సంఘటనా స్థలానికి చేరుకుని సపర్యలు చేశారు. 108కు ఫోన్ చేసి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

పడవ బోల్తా పడి మత్స్యకారుడు మృతి

రణస్థలం: మండలంలోని కొవ్వాడ గ్రామానికి చెందిన మైలపల్లి పోత య్య(67) వేటకు వెళ్లి పడవ బోల్తా పడడంతో మృతి చెందారు. గ్రామస్తులు, జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కొవ్వాడ గ్రామానికి చెందిన పోతయ్య, అతని కుమారుడు రాముడు, మరో వ్యక్తి సీతయ్య శనివారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో సముద్రంలోకి వెళ్లారు. అలల ఆటుపోట్లకు పడవ బోల్తా పడడంతో పోతయ్య మృతి చెందారు. మిగిలిన ఇద్దరు ఒడ్డుకు చేరుకున్నారు. తర్వాత గ్రామస్తుల సహకారంతో మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువచ్చారు. పోతయ్యకు భార్య సీతమ్మ, పెళ్లైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతితో ఆ ఇంట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. జేఆర్ పురం ఎస్‌ఐ కె.గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

నాట్య సమ్మోహనం

- ఉత్సాహంగా 20వ ధౌలి- కళింగ మహోత్సవం
- ఆకట్టుకున్న కథక్, ఒడిస్సీ, చౌ నృత్య ప్రదర్శనలు



అహ్మదాబాద్ ఆనార్త్ డ్యాన్స్ కళాకారుల కథక్ నృత్య భంగిమలు



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నృత్య కారిణుల విన్యాసం



అలరించిన డ్యాన్స్

భువనేశ్వర్: ఒడిషా సంగీత నాటక అకాడమీ, ఆర్ట్ విజన్ కలిసి ఒడియా భాష, సాహిత్యం, సంస్కృతి శాఖ, ఒరిస్సా డ్యాన్స్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన 20వ ధౌలి-కళింగ మహోత్సవ్‌లో నృత్య రూపకాలు అదరహో అనిపిస్తున్నాయి. ప్రఖ్యాత కళాకారుడు కథక్, భారతీయ శాస్త్రీయ ఒడిస్సీ, చౌ యుద్ధ నృత్య రూపాల అందమైన సమ్మేళనాన్ని ప్రేక్షకులు ఆద్యంతం వీక్షించారు. ఇషిరా పారిఖ్, మౌలిక్ షా ఆధ్వర్యంలో అహ్మదాబాద్ ఆనార్త్ డ్యాన్స్ కంపెనీ కళాకారులు కథక్ నృత్యాలను అద్భుతంగా ప్రదర్శించారు. అంతర్ నాథ్, శ్రీరాముని పౌరాణిక గాథ రాఘవ రఘురాయ్ కథక్ నృత్త రూపకాలు అలరించాయి. అనంతరం వేణుగానం శ్రోతలకు వీనుల విందు చేసింది. మీరా దాస్ సారథ్యంలో కటక్‌లోని గుంజన్ డ్యాన్స్ అకాడమీ బృందం ప్రదర్శించిన ఒడిస్సీ ప్రదర్శన ఆకట్టుకుంది. గుంజన్ డ్యాన్స్ అకాడమీకి చెందిన నృత్య కళాకారులు స్త్రీల పాత్ర ప్రాముఖ్యతని ప్రతిబింబించేలా బిందు రు సింధు ఒడిస్సీ నృత్య రూపకం ప్రదర్శించింది. చివరగా అభిషేక్ త్రిపాఠి, బృందం (ఎ.కె.క్రియేషన్, ఖుర్దా)చే మయూర్‌భంజ్ చౌ యుద్ధ నృత్య ప్రదర్శన ఇచ్చారు. ప్లాస్టిక్ వాడకం వల్ల భూమిపై జీవులకు కలిగే హానిని వివరించారు. ఈ నృత్యానికి పద్మశ్రీ డాక్టర్ ఇలియానా సిటారిస్టి నృత్య దర్శకత్వం వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు హేమంత్ శర్మ, విశాల్ కుమార్ దేవ్, లలిత్ మాన్‌సింగ్, అమెరికా భారత మాజీ రాయబారి, నృత్య రంగం ప్రముఖులు గురు అరుణా మహంతి, గురు ఇలియానా సిటారిస్టి, డాక్టర్ (ఇంజినీరు) శ్రీనివాస్ ఘటువారి, అనన్య పరిదా పాల్గొన్నారు.

భారత్ జోడో యాత్రలో కొరాపుట్ నేతలు



రాహుల్ గాంధీతో కాంగ్రెస్ యువ నేతలు

జయపురం: ఒడిశాలో ప్రవేశించిన ఏఐసీసీ కార్యదర్శి రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న భారత్ జోడో న్యాయయాత్రలో జయపురం యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కొరాపుట్ జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సుకాంత పట్నాయక్, జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పవిత్ర సవుతా, జయపురం శాసన సభా నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్‌రావు యాత్రలో రాహుల్ కలిసి నడిచారు. జయపురం ఎమ్మెల్యే, కాంగ్రెస్ చీఫ్ విప్ తారాప్రసాద్ బాహిణీపతితో కలిసి పార్టీ కోసం పనిచేస్తున్నామని తెలిపారు.

మల్కన్‌గిరిలో కుక్కల స్వైర విహారం



గాయపడిన దిలీప్‌కుమార్

మల్కన్‌గిరి : జిల్లా కేంద్రం మల్కన్‌గిరిలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీధుల్లో గుంపులుగా సంచరిస్తూ దాడులకు పాల్పడుతున్నాయి. శనివారం దుర్గగుడి వీధిలో దిలీప్‌కుమార్ అనే వ్యక్తిపై కుక్కల గుంపు దాడి చేసింది. ఈ ఘటనలో దిలీప్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇప్పటికైనా మున్సిపల్ సిబ్బంది స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆదివాసీ విద్యా విధానంపై సెమినార్



మాట్లాడుతున్న మనోరంజన్ ప్రధాన్

జయపురం: ఆదివాసీ పిల్లల విద్యపై జయపురం విక్రమదేవ్ విశ్వవిద్యాలయంలో శనివారం రెండు రోజుల సెమినార్ ప్రారంభమైంది. వర్సిటీ బీఈడీ టీచర్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సెమినార్‌ను ఓఎస్‌డీ, వైస్ చాన్సలర్ దేవీ ప్రసాద్ మిశ్రా ప్రారంభించారు. అనంతరం 'కుండ కలిక' అనే గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీజీ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ కిచక్ చంద్ర జెనా మాట్లాడుతూ ఆదివాసీ పిల్లల విద్యా ప్రగతికి సెమినార్లు దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలోసెమినార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ మనోరంజన్ ప్రధాన్, ప్రొఫెసర్ నిత్యానంద పండా, నిత్యానంద ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

సంచార ఏటీఎం ప్రారంభం



ఏటీఎంను ప్రారంభిస్తున్న బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణీగ్రాహీ



సంచార ఏటీఎం

కొరాపుట్: కొరాపుట్ సెంట్రల్ కో ఆపరేటివ్ బ్యాంక్ సంచార ఏటీఎం వాహనాలను శనివారం నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి కేంద్రంలో బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణీగ్రాహీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయగడ, మల్కన్‌గిరి, కొరాపుట్ జిల్లాల్లోనూ మొబైల్ ఏటీఎంలు ప్రారంభిస్తామన్నారు. తమ బ్యాంక్ శాఖలు లేని ప్రాంతాల్లో జన సామర్థ్యం ఉన్న చోట వాహనాలు సంచరిస్తాయని పేర్కొన్నారు. నబరంగ్‌పూర్ జిల్లాలో నబరంగ్‌పూర్, ఉమ్మర్ కోట్, పపడాహండి, కొసాగుమ్డ పట్టణాలలో తమ బ్యాంక్ శాఖలు ఉన్నాయని వివరించారు. రాయిఘర్ వంటి పెద్ద పట్టణాలలో ఖాతాదారులకు సేవలు అందించేందుకు మొబైల్ ఏటీఎంలు ఉపకరిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో రాయిఘర్ చైర్మన్ నవీనా నాయక్, కేబీకే సలహాదారుడు డబుల్ గోండో, కేసీసీబీ డైరెక్టర్లు భీమో హరిజన్, శ్యామ్‌లాల్ బంజార్, బ్యాంక్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దిగంబర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన



కళాకారులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

జయపురం: ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాహిత సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అమొ ఒడిశా నవీన ఒడిశా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా జాగా మిషన్ అధికారి హరిశంకర రౌత్ తెలిపారు. శుక్రవారం జయపురంలోని బాబా సాహెబ్ కల్యాణ మండపంలో అమొ ఒడిశా నవీన ఒడిశాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు, పథకాలపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పథకాల లక్ష్యాలను వివరించారు. అనంతరం కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, కార్యనిర్వాహక అధికారి సిద్దార్థ పట్నాయక్, మునిసిపాలిటీ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అశ్వినీ పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

సిరిపంచమికి సన్నద్ధం



హన్‌మాన్ బజార్‌లో సరస్వతీదేవి విగ్రహాలు



బాపురు జార్‌లో విగ్రహాల విక్రయం

బరంపురం: ఈ నెల 14న సిరి పంచమి సందర్భంగా బరంపురం నగరంలో సరస్వతీదేవి విగ్రహాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. స్థానిక హన్‌మాన్‌బజార్, గిరి మార్కెట్ రోడ్, కొమ్మపల్లి, బాపురు బజార్, చిన్నా బజార్, పెద్ద బజార్‌లలో సరస్వతి విగ్రహాలను నగరవాసులు, పాఠశాల, కళాశాలల ప్రతినిధులు కొనుగోలు చేశారు. పూజా సామగ్రికి కూడా గిరాకీ ఏర్పడింది.

16న సార్వత్రిక సమ్మె



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పర్లాకిమిడి: ఈ నెల 16న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని అఖిల భారత కిసాన్ మజ్దూర్ సంఘ్ అధ్యక్షుడు కేదార్ శోబోరో పిలుపునిచ్చారు. స్థానిక దండుమాలవీధిలోని సీపీఎం కార్యాలయంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన మూడు నల్లచట్టాలు, ప్రజలకు విరుద్ధమైన విద్యుత్ బిల్లులు, రైతుల న్యాయమైన డిమాండ్ల సాధనకు సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. ఫిబ్రవరి 16న పాఠశాలలు తప్ప రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల కార్యాలయాలు పనిచేయకుండా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు ఆర్.లోకనాథం, సి.పి.ఎం(లిబరేషన్) నాయకులు శ్రీనివాస బెహరా, సి.పీ.ఐ.నాయకులు కామేశ్వర బెహరా, ఎం.బంగారి, కిసాన్ సభ కార్యదర్శి ఎం.జగన్నాథం, పైల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల్లో నైపుణ్యాలు కీలకం: ఎస్పీ



గౌరవ వందన అందుకుంటున్న ఎస్పీ జీఆర్ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీసుల్లో నైపుణ్యాలు కీలకమని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో 15 రోజుల పాటు ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు నిర్వహించిన మొబలైజేషన్ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా పోలీసులు నైపుణ్యాలు ప్రదర్శించారు. ముందుగా ప్రత్యేక పరేడ్ నిర్వహించారు. ఈ పరేడ్‌ను ఎస్పీ వాహనంలో పరిశీలించారు. డ్రిల్ నిర్వహణను అభినందించారు. మొబలైజేషన్‌లో పోలీసులకు విశ్రాంతి, నూతన అంశాలు తెలుసుకునేందుకు మంచి అవకాశం లభించిందని చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని, సమర్థంగా విధులు నిర్వహించేలా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ ప్రేమ్‌కాజల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కేవీ నర్సింగరావు, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

దురాశ బ్యాంకు ఖాతాకు చేటు

- రోజురోజుకీ పెరుగుతున్న సైబర్ మోసాలు
- ఉచ్చులో చిక్కుకుంటున్న విద్యావంతులు



శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కలెక్టరేట్‌లో ఓ ఉద్యోగి.. పని వేళల్లో చిన్న విరామం దొరికినా చాలు మొబైల్‌లో ఆన్‌లైన్ గేమ్‌లు ఆడేవాడు. మొదట్లో రూ. వేయి పెడితే రూ.1350.. రూ. 1800 పెడితే రూ. 2300 వచ్చాయి. అలా ఆడుతూ ఆడుతూ ఏకంగా రూ. 40 లక్షలు పెట్టుబడిగా పెట్టాడు. డబ్బంతా పోయాక మోసపోయానని గ్రహించాడు.

శ్రీకాకుళంలో ఓ ప్రముఖ వ్యాపారి మనవరాలు సాఫ్ట్‌వేర్ ఇంజినీరు. ఆమె కూడా ఇదే మాదిరే రూ. 22 లక్షలు మోసపోయింది. తండ్రి ఎందుకులే ఫిర్యాదు చేయడమని మిన్నకుండిపోయారు.

జిల్లాలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. చదువు లేని వారు, ఇంగ్లిష్‌లో ఫోన్ మెసేజీలు అర్థం కాని వారు మోసపోవడం వేరు. కానీ జిల్లాలో విద్యావంతులు, ఉద్యోగులు సైబర్ వలలో చిక్కుకుంటున్నారు. రూ.లక్షల్లో డబ్బు పోగొట్టుకున్నాక లబోదిబోమంటున్నారు. కొందరు ఫిర్యాదు చేస్తుండగా మరికొందరు మిన్నకుండిపోతున్నారు. గడిచిన మూడేళ్లగా 604 వైట్‌కాలర్ నేరాలు నమోదు కావడం విశేషం. బాగా చదువుకుని సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో ఉన్న వారు, వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్న వారు ఆన్‌లైన్ మోసగాళ్ల ఉచ్చుకు చిక్కుకుంటున్నారు. మోసపోయామని తెలుసుకున్నాక కుటుంబ సభ్యులకు చెప్పుకోలేక, ఆన్‌లైన్ ఫిర్యాదులు, సైబర్ సెల్ ఫిర్యాదుల వరకు వెళ్లినా.. పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు పరువుపోతుందేమోనని వెనకడుగు వేస్తున్నారు.

కొన్ని మోసాలు..

- గత జనవరి నెల బిట్‌కాయిన్స్ ట్రేడింగ్ టాస్క్‌ల పేరిట ఆమదాలవలస మండలానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ యువకుడి నుంచి రూ. 16.16 లక్షలు నెట్ బ్యాంకింగ్ ద్వారా సైబర్ కేటుగాళ్లు దోచుకున్నారు. అహ్మదాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా ఉన్నా ఆమదాలవలసలో వర్క్‌ఫ్రం హోంగా ఉంటున్న ఆ ఉద్యోగిని టెలిగ్రామ్ యాప్‌లో వచ్చిన వీడియో క్లిప్పింగ్‌లకు రివ్యూ (లైక్) ఇస్తే అమౌంట్ వస్తుందని నమ్మించి ఇలా మోసం చేశారు.
- ఈ నెలలో జిల్లాకేంద్రానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇదే పంథాలో రూ. 17 లక్షల మోసానికి గురయ్యారు.
- గత ఏడాది డిసెంబరులో ఎస్బీఐ బ్యాంకు రివార్డ్ పాయింట్స్ పేరిట ఆమదాలవలస మండలం కొర్లకోట గ్రామానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి రూ. 50,999లు మోసానికి గురయ్యాడు. హెచ్‌టీటీపీఎస్://డిఎఎల్‌టిపి.విఇఆర్‌సిఎల్.ఎపిపి/ లింక్ క్లిక్ చేయగానే రివార్డు పాయింట్స్ రూ. 9980లు రావడంతో ఆశపడిన ఆ ఉద్యోగి ఇలా బుక్ అయ్యాడు. డిసెంబరు 29న ఫిర్యాదు అందింది.
- టోల్‌ఫ్రీ నంబర్ కోసం ఆన్‌లైన్‌లో వెతికి కంపెనీ ప్రతినిధి ఎవరన్నది తెలుసుకోకుండా మాట్లాడి.. వారు పంపిన మెసేజ్‌లు, బ్యాంకు అకౌంట్ డీటైల్స్ కంపెనీదా కాదా అని తెలుసుకోకపోవడం వల్ల నగరంలోని ఓ బిల్డర్ 13.10 లక్షలు మోసపోయాడు. అల్ట్రాటెక్ కంపెనీవి 3,300 బస్తాల సిమెంట్ కొనుగోలు కోసం టోల్‌ఫ్రీ నంబర్ సంప్రదించగా ఈ మోసం జరిగింది. ఘటన గత ఏడాది అక్టోబరులో జరిగింది.
- ఆమదాలవలస పట్టణంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఓ యువకుడు తన తండ్రి రిటైర్ అవ్వగా వచ్చిన సొమ్ముతో ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెట్టి దఫదఫాలుగా రూ. 8.87లక్షలు పంపి మోసపోయాడు.

పలు విధాలుగా వల

ఆన్‌లైన్‌లో చాలా విధాలుగా మోసం చేస్తున్నారు. ఫేక్‌ప్రొఫైల్స్‌తో టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్, ఎఫ్‌బీ, వాట్సాప్‌ల్లో దర్శనమిస్తారు. మనతో మాట్లాడాక బలహీనతలను గుర్తించి కావాల్సిన సమాచారం రాబడతాడు. డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు నంబర్లు, గడువు తేదీ, సీవీవీ కోడ్, ఓటీపీ వంటివి సేకరించి బ్యాంకు ఖాతా నుంచి సొమ్ము కాజేస్తారు. మెయిల్, ఎస్ఎంఎస్ పంపించడం, లింక్‌లు పంపించడం, బ్యాంకు, కస్టమర్ కేర్ ప్రతినిధులమని ఫోన్ చేసి మోసం చేస్తుంటారు. డెబిట్, క్రెడిట్ కార్డు క్లోనింగ్ విధానంలో స్కిమ్మర్ అనే చిన్న ఎలక్ట్రానిక్ సాధనం ఉపయోగించి డెబిట్, క్రెడిట్ కార్డు వెనుక వైపు ఉన్న మాగ్నెటిక్ స్ట్రిప్‌లో ఉన్న కార్డు సమాచారాన్ని అక్రమంగా దొంగలిస్తారు.

జాగ్రత్తలు పాటిస్తే మేలు

- బ్యాంకు, ఫైనాన్షియల్, కస్టమర్ కేర్ ప్రతినిధులమని ఎవరైనా ఫోన్ చేసినా మాట్లాడకూడదు. ఈ-మెయిల్, ఎస్ఎంఎస్‌లు పంపించినా వాటిని ఓపెన్ చేయకూడదు.
- ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, కార్డు నెంబర్లు, గడువు తేదీలు ఎవరైనా ఫోన్ చేసి అడిగితే చెప్పకూడదు.
- ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్ వంటి సోషల్ మీడియా అకౌంట్లను భద్రంగా ఉంచాలి.
- ఓపెన్, పబ్లిక్ వైఫై నెట్‌వర్క్‌లకు ఎప్పుడూ కనెక్ట్ కావద్దు.
- ఇంటర్నెట్‌లో దొరికే సాఫ్ట్‌వేర్‌లను ఎప్పుడూ ఇన్‌స్టాల్ చేయకూడదు. లేటెస్టు యాంటీ వైరస్‌తో అప్‌డేట్ చేసి ఉంచుకోవాలి.
- అత్యాశ పడకపోతే మంచిది..

జాగ్రత్తగా ఉండాలి



ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్త అవసరం. మెసేజ్‌లు, స్పామ్ కాల్స్, బ్లాక్ కాల్స్ రూపంలో ఫోన్‌లు వస్తుంటాయి. అవి లిఫ్ట్ చేసినా, మెసేజ్‌లపై క్లిక్ కొట్టినా మన ఖాతాలు ఖాళీ చేయడానికి సైబర్ చోరులు సిద్ధంగా ఉంటారు. ఇలాంటివాటిపై అప్రమత్తంగా ఉండి అత్యాశ పడకపోతే మంచిది. ఇప్పటికే ఇలాంటి సైబర్ నేరాలు చేస్తున్నవారి కొన్ని రాష్ట్రాలను గుర్తించి అక్కడికి మన పోలీసు బృందాలను పంపించి 41-ఏలు నమోదు చేశాం. అమౌంట్ రికవరీకి ప్రయత్నిస్తున్నాం.

– ఎస్పీ రాధిక, శ్రీకాకుళం

క్లుప్తంగా

బావిలో పడి వృద్ధుడి మృతి


మృతుడు రామారావు(ఫైల్)

బాడంగి: స్నానానికి బావి దగ్గరకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి పోయి దామోదర పాత్రుని రామారావు(65) శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు...మండలంలోని పూడివలసలో గతంలో నివాసం ఉండే రామారావు ప్రస్తుతం విశాఖలోని మల్కాపురంలో కుమార్తె వద్ద ఉంటున్నాడు. మండలంలోని ముగడ కాలనీలో అన్న కుమారుడు ఉండడంతో గురువారం సాయంత్రం ఇక్కడకు వచ్చి సాయంత్రం తిరిగి పూడివలస వెళ్లి పోతానని బయలుదేరారు. సామాజిక పింఛన్ కోసం గ్రామానికి వచ్చి కొద్ది రోజులు పాటు ఇక్కడే ఉంటున్న రామారావు బావిలో ఎప్పుడు పడిపోయాడో తెలియలేదు. బావిలో రామారావు మృతదేహాన్ని శనివారం గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ప్రమాదవశాత్తు పడిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. భార్య కళావతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఆర్.జయంతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

పొలంలో వ్యక్తి మృతి


మృతుడు వీర్రాజు

వీరఘట్టం: స్థానిక బీసీ కాలనీలో కుమ్మరి వీధికి చెందిన పెనుగుర్తి వీర్రాజు(41) శనివారం సాయంత్రం పొలంలో పంటను పశువులు తినేస్తున్నాయని, వాటిని తోలబోతూ గట్టును తన్నేసి పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. బీసీ కాలనీకి సమీపంలో ఇటుక బట్టీలో ఇటుకలు తయారు చేస్తుండగా పక్కనే ఉన్న మొక్కజొన్న పొలంలో పశువులు పంటను తినేస్తున్నాయని వాటిని తోలేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు మట్టి గట్టు తన్నేసి పడిపోయాడు. సమీపంలో ఉన్న వారు అతన్ని వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారి, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీర్రాజు మృతితో కుమ్మరివీధిలో విషాదం నెలకొంది.

గాయపడిన వ్యక్తి మృతి


కలమట రతాలు (ఫైల్)

వంగర: మండల పరిధి రుషింగి–రాజులగుమ్మడ గ్రామాల మధ్య ఈ నెల 5వ తేదీన జరిగిన ఆర్టీసీ బస్సు–ఆటో ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన కలమట రతాలు(62) శనివారం వేకువజామున మృతి చెందాడు. అప్పట్లో జరిగిన ఘటనలో 13 మంది వరకు గాయపడిన విషయం తెలిసిందే. రతాలు పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రాగోలు ఆస్పత్రికి తరలించి చికిత్సను అందించారు. పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు రాజశేఖర్, కుమార్తె ప్రేమలత ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన తమను ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

దేవదాయ శాఖలో పదోన్నతులు, బదిలీలు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): సుదీర్ఘకాలం తర్వాత దేవదాయ శాఖలో ఈవోలకు పదోన్నతులు, బదిలీలు జరిగాయి. సహాయ కమిషనర్లకు ఉప కమిషనర్లగాను, ఎగ్జిక్యూట్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్‌లకు సహాయ కమిషనర్లగా పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరంలోని రామ తీర్థాలు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఈవో) బి.హెచ్.ఎస్.ఎస్.కిషోర్ కుమార్‌కు డిప్యూటీ కమిషనర్(డీసీ)గా పదోన్నతి కల్పిస్తూ తూర్పుగోదావరి జిల్లా వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఈవోగా నియమించారు. అన్నవరం దేవస్థానంలో అసిస్టెంట్ కమిషనర్(ఏసీ)గా పనిచేస్తున్న డి.వి.ఎల్.రమేష్ బాబుకు డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ శ్రీకాకుళం జిల్లాలోని అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమించారు. కోనసీమ జిల్లాలో ఏసీగా పనిచేస్తున్న కె.ఎస్.డి.వి. ప్రసాద్‌కు డీసీగా పదోన్నతి కల్పిస్తూ విజయనగరంలోని మాన్సాస్ ట్రస్ట్ ఈఓగా నియమించారు. ఇక్కడ ఈవోగా పనిచేస్తున్న డీవీవీ ప్రసాద్‌కు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. సింహాచలం దేవస్థానంలో గతంలో ఏఈఓగా పని చేసి ప్రస్తుతం అన్నవరంలో ఏఈవోగా పని చేస్తున్న వై.శ్రీనివాసరావుకు సహాయ కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ రామతీర్థాలు దేవస్థానం ఈవోగా నియమించారు. శ్రీకాకుళం జిల్లాలో ఏసీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న బలివాడ ప్రసాద్ పట్నాయక్‌కు సహాయ కమిషనర్‌గా పదోన్నతి కల్పించి అదే జిల్లా ఏసీగా నియమించారు. అక్కడ ఏసీగా పనిచేస్తున్న హరి సూర్య ప్రకాష్‌కు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. ఇసుక కొండ శ్రీ సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఈవో బి.నగేష్‌బాబును సహాయ కమిషనర్‌గా పదో న్నతి కల్పించి తూర్పుగోదావరి జిల్లా మావుళ్లమ్మ దేవస్థానం ఈవోగా నియమించారు.

నాలుగున్నరేళ్లలో..

తోటపల్లికి కొత్తకళ

ఫ్యాక్ట్ చెక్

- రూ.195.34 కోట్ల వ్యయంతో ఆధునికీకరణ పనులు
- ఎడమకాలువలో 16.843 కి.మీ., కుడికాలువలో 9.376 కి.మీ మేర కాంక్రీట్ పనులు పూర్తి
- ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు
- చంద్రబాబు పాలనలో 2014–2018 వరకు కరువు పరిస్థితి
- సాగునీటికి తప్పని తంటాలు
- ఈనాడు విషపు రాతలపై జలవనరులశాఖ అధికారుల ఆగ్రహం

వీరఘట్టం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏ శుభ ముహూర్తాన రాష్ట్రంలో అధికారం చేపట్టిందో అప్పటి నుంచి వ్యవసాయం పండగలా మారింది. సకాలంలో వర్షాలు కురుస్తున్నాయి. జలాశయాలు నిండుతున్నాయి. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల రైతులకు సాగునీటి ఆధారమైన తోటపల్లి జలాశయం ఏటా నీటితో కళకళలాడుతోంది. జలవనరుల శాఖ అధికారులు ప్రణాళికా బద్ధంగా ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేస్తున్నారు. రైతులకు సాగునీటి వెతలు లేకుండా, సాగును సస్యశ్యామలం చేస్తున్నారు. వాస్తవ పరిస్థితులను విస్మరిస్తూ శనివారం 'ఈనాడు' పత్రిక అచ్చేసిన అసత్యాలపై జలవనరులశాఖ అధికారులు మండిపడుతున్నారు.

2020లో తోటపల్లి ఆధునీకీకరణ పనులకు శ్రీకారం

టీడీపీ ప్రభుత్వం 2019లో చేపట్టిన అరకొర పనులు వెంటనే ఆగిపోయాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరం, పాలకొండ, రాజాం ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, కంబాల జోగులు, ప్రస్తుత ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు తోటపల్లి కాలువల ప్రాధాన్యతను, ఇక్కడ




తోటపల్లి జలాశయంలో పరిధిలో లైనింగ్ పనులు పూర్తయిన ఎడమ ప్రధాన కాలువ

రైతులు, పంటల పరిస్థితిని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీ పాలనలో జరిగిన పొరపాట్లను సవరిస్తూ తోటపల్లి కాలువలకు రూ.195.34 కోట్లు నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. అంతేకాక టీడీపీ హయాంలో జరిగిన అరకొర పనులకు కూడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించింది. తర్వాత చకచకా పనులు ప్రారంభించింది.

ఇంత వరకు జరిగిన పనులు ఇలా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తోటపల్లి కాలువల ఆధునీకీకరణ పనులపై దృష్టి సారించింది. 37.536 కి.మీలు పొడవున్న ఎడమకాలువలో ఇంతవరకు 16.843 కి.మీ వరకు కాంక్రీట్ పనులు పూర్తయ్యాయి. అలాగే, 17.616 కి.మీ పొడవున్న కుడికాలువలో 9.376 కి.మీ వరకు కాంక్రీట్ పనులు చేపట్టారు. మొత్తం 55.152 కి.మీలకు గాను ఇంత వరకు 26.919 కి.మీ (38 శాతం) పనులు చేపట్టారు. ఎడమకాలువలో అచ్చపువలస, 6వ బ్రాంచ్, ఎం.రాజపురం, కత్తులకవిటి వద్ద వెడల్పయిన వంతెనలు నిర్మించి వాహనరాకపోకలకు మార్గం సుగమం చేశారు. ఇలా నీటి పంపిణీకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా గత ఖరీఫ్‌లో చర్యలు చేపట్టి శివారు వరకు సాగునీరందించారు. ఇలా ఒక పక్క ఆధునికీకరణ పనులు చేపడుతూ మరోపక్క గత ఐదు ఖరీఫ్ సీజన్లలో సకాలంలో కాలువలకు సాగునీరందిస్తూ ప్రభుత్వం తోటపల్లి ఆయకట్టును సస్యశ్యామలం చేస్తుంటే, తోటపల్లి కాలువ పనులపై ఈనాడు తప్పుడు వార్తలు రాస్తుండడం ఎంత వరకు సమంజసమని జలవనరులశాఖ అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఈనాడు అసత్యాలు రాస్తోందంటూ రైతులు వాపోతున్నారు.

పుష్కలంగా సాగునీరు..



గత ఖరీఫ్ సీజన్‌లో శివారు ఆయకట్టుకు సైతం సాగునీరు పుష్కలంగా అందించాం. ఈ ఏడాది పంటల దిగుబడి బాగా వచ్చిందని రైతులు చెబుతున్నారు. కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ మిగులు పనులు ఈ నెలాఖరుకు పునః ప్రారంభిస్తాం. పెండింగ్ బిల్లులు కూడా కొద్దిరోజుల్లో విడుదల చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

– దమలపాటి రవికుమార్, డీఈఈ, జలవనరులశాఖ, పాలకొండ డివిజన్

గత టీడీపీ పాలనలో అంతా కరువే...

గత టీడీపీ పాలనలో తోటపల్లి ఆయకట్టు రైతులు తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొన్నారు. 2014లో టీడీపీ అధికారం చేపట్టిన ఏడాదే అక్టోబర్ 8 నుంచి 14 వరకు హుద్‌హుద్ తుఫాన్ విలయ తాండవం చేస్తూ వరి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఈ తుఫాన్‌లో పంటలు నష్టపోయిన రైతులను అప్పటి పాలకులు విస్మరించారు. తమ బినామీల పేర్లు నమోదు చేసి పంటల పరిహారాన్ని స్వాహా చేశారు. 2015 నవంబర్‌లో చావ్లా తుఫాన్ ప్రభావంతో పంటలకు నష్టం కలిగింది. మరుచటి ఏడాది 2016 ఆగస్టు 18న తోటపల్లి ఎడమకాలువలో పెద్దబుడ్డిడి వద్ద ఉన్న బ్రిటిష్ కట్టడం సైఫన్‌కు భారీ గండిపడింది. దీంతో సైఫన్‌కు దిగువన ఉన్న 30 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందక పంటలు ఎండిపోయాయి. 2017 ఖరీఫ్‌లో ఫణి తుఫాన్ పంటలను నష్టపరిచింది. 2018లో అక్టోబర్ 8 నుంచి 12 వరకు సంభవించిన తిత్లీ తుఫాన్ దాటికి పంటలు సమూలంగా నేలమట్టమయ్యాయి. ఇలా 2014 నుంచి 2018 వరకు చంద్రబాబు పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా కరువు ఏర్పడడంతో పాటు తోటపల్లి పాత ఆయకట్టు రైతులు తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొన్నారు. తోటపల్లి పాత ఆయకట్టు కాలువల ఆధునీకీకరణకు చంద్రబాబు ప్రభుత్వం ముందుకు రాలేదు. 2019లో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తోటపల్లి కాలువలకు ఆదరాబాదరాగా నిధులు మంజూరు చేసి వీరఘట్టం మండలం అచ్చెపువలస వద్ద శంకుస్థాపన పనులు చేట్టి రైతులను మోసగించే ప్రయత్నం చేశారు.

ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక శిక్షణ


వీడియో కాన్ఫెరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కె.కార్తీక్

విజయనగరం అర్బన్: పోలింగ్, కౌంటింగ్ విధులు మినహా ఎన్నికల్లో ఇతర విధులు నిర్వహించే అధికారులందరికీ ఈ నెలాఖరులోగా అనవరమైన శిక్షణలు పూర్తిచేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్‌లో శనివారం సమీక్షించారు. జిల్లాల్లో ఎన్నికల నిర్వహణకు కమ్యూనికేషన్ ప్లాన్, రవాణా, ఓటరు ఫొటో గుర్తింపు కార్డుల పంపిణీ, ఓటర్ల జాబితాలపై అభ్యంతరాల పరిష్కారం, పోలింగ్ సిబ్బంది, భద్రతా సిబ్బంది నియామకం తదితర అంశాలను ఎన్నికల అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో చేసిన ఏర్పాట్లపై కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి వివరించారు. జిల్లాలో 16 మినహా అన్ని పోలింగ్ కేంద్రాల్లో మరుగుదొడ్ల సదుపాయం కల్పించామన్నారు. జిల్లాలో ఒక పోలింగ్ కేంద్రానికి కేవలం ద్విచక్రవాహనం ద్వారా మాత్రమే చేరుకునేందుకు అవకాశం ఉందని, అక్కడ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పరిశీలిస్తున్నట్టు చెప్పారు. ఐదు పోలింగ్ కేంద్రాలకు మొబైల్ కనెక్టివిటీ లేదని, ఆయా ప్రదేశాలకు కమ్యూనికేషన్ ఏర్పాట్లపై టెలికాం అధికారులతో చర్చిస్తున్నామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ కె.కార్తీక్ డీఆర్‌ఓ ఎస్.డి.అనిత, ఆర్‌డీఓలు సాయిశ్రీ, ఎం.వి.సూర్యకళ, ఎస్‌డీసీలు మురళీకృష్ణ, సుధారాణి, ప్రమీలారాణి, సీపీఓ బాలాజీ, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, డీఎస్‌ఓ మధుసూదనరావు, జిల్లా ఆడిట్ అధికారి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

5.03 లక్షల ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో 5.03 లక్షల మంది లబ్ధిదారులకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు అందజేసినట్టు జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు పేర్కొన్నారు. ఇంకా 30 వేలు వరకు ఆరోగ్యశ్రీ కార్డులు రావాల్సి ఉందని చెప్పారు. కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు రాని వారు పాత ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా సేవలు పొందవచ్చని చెప్పారు. ఆరోగ్యశ్రీ వైద్యం ఖర్చును ప్రభుత్వం రూ.5లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచిందన్నారు.

హోరా.. హోరీగా...

ఆంధ్ర - ఉత్తరప్రదేశ్ జట్ల రంజీ మ్యాచ్

- 198 పరుగులకే ఆలౌటైన ఉత్తరప్రదేశ్ జట్టు
- 5 వికెట్లు దక్కించుకున్న ఆంధ్రా ఆల్ రౌండర్ శశికాంత్


94 పరుగులు చేసిన ఆంధ్రా కెప్టెన్ రిక్కీబుయ్


బౌలింగ్‌లో 5 వికెట్లు తీసిన శశికాంత్

విజయనగరం: ఆంధ్ర – ఉత్తరప్రదేశ్ జట్ల మధ్య జరుగుతున్న రంజీ మ్యాచ్ హోరా.. హోరీగా సాగుతోంది. డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో 236 పరుగులకు నాలుగు వికెట్ల నష్టంతో రెండవ రోజు శనివారం మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు మొత్తం 95.1 ఓవర్లలో 261 పరుగులు ఆలౌటైంది. జట్టు బ్యాటింగ్‌లో కెప్టెన్ రిక్కీ బుయ్ 94 పరుగులు, కెవి.శశికాంత్ 72 పరుగులు, కరణ్ షిండే 45 పరుగులతో రాణించారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఉత్తరప్రదేశ్ క్రీడాకారులు 51.5 ఓవర్లలో 198 పరుగులకు మైదానం నుంచి వెనుదిరిగారు. ఆంధ్రా బౌలర్ కెవి.శశికాంత్ అటు బ్యాట్‌తో పాటు ఇటు బంతితో రాణించాడు. మొత్తం 15 ఓవర్లు వేసి 5 వికెట్లు చేజిక్కించుకుని ఉత్తరప్రదేశ్ జట్టును కుప్పకూల్చాడు. బ్యాటింగ్‌లో ఉత్తరప్రదేశ్ క్రీడాకారుడు ఆర్యన్ జూయల్ 60 పరుగులు మినహా మిగిలిన క్రీడాకారులు ఎక్కువ సమయం మైదానంలో నిలవలేకపోయారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 4.3 ఓవర్లలో వికెట్ నష్టపోయి 19 పరుగులు జోడించారు.

నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ

రేగిడి: మండలంలోని ఉంగరాడ, ఉంగరాడ మెట్ట, వండానపేట, చాటాయివలస, కె.ఎం.వలస, ఉప్పర్నాయుడువలస, వన్నలి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నులిపురుగు నివారణ మాత్రలు శనివారం పంపిణీ చేశారు. అనంతరం ఈ మాత్రల ప్రయోజనాన్ని ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లలు, పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. ఏడాది నుంచి 19 ఏళ్ల వయసున్న వారందరూ ఈ మాత్రలు వేసుకోవాలని తెలిపారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు

రాజాం: స్థానిక జీసీఎస్ఆర్ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు కుదమ తిరుమలరావు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి జ్ఞానం ఆర్జించడంతో పాటు వ్యక్తిత్వ వికాసం పొందాలన్నారు. ఉన్నత లక్ష్యాలు చేరుకున్న వ్యక్తుల జీవిత చరిత్రలు చదవడాన్ని అలవాటు చేసుకోవాలని, ఇంట్లోనే ఓ గదిని గ్రంథాలయంగా మార్చుకుని, మంచి మంచి పుస్తకాలు ఉంచి, చదువుకోవాలని తెలిపారు. అనంతరం తిరుమలరావును సిబ్బంది సన్మానించారు.

సీతంలో ఇంక్యుబేషన్ సెంటర్



ఒప్పంద పత్రాలతో బీఎస్ఎన్ఎల్ అధికారి సత్యప్రసాద్, సీతం డైరెక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: సత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (సీతం)లో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటుకు బీఎస్ఎన్ఎల్‌తో సీతం యాజమాన్యం ఒప్పందం కుదుర్చుకుంది. కళాశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి, బీఎస్ఎన్ఎల్ విశాఖ డీజీఎం డాక్టర్ మల్ల సత్యప్రసాద్ ఒప్పంద పత్రంపై సంతకం చేశారు. ఈసీఈ, సీఎస్ఈ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ట్రిపుల్‌ఈ విద్యార్థులకు ఏఐ, మిషన్ లెర్నింగ్ మరియు ఐఓటీ సాంకేతిక కోర్సులపై పరిశోధనలు చేసుకునే సౌలభ్యం లభిస్తుందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు తెలిపారు. ఎల్‌టీఐ, 4జీ, 5జీ సాంకేతికలపై విద్యార్థులకు శిక్షణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ టీడీవీఏ నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

400 క్యూసెక్కుల నీరు విడుదల


మడ్డువలస కుడిప్రధాన కాలువలో ప్రవహిస్తున్న సాగునీరు

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు కుడి ప్రధాన కాలువ ద్వారా ఆయకట్టు భూములకు సాగునీటి సరఫరాను అధికారులు శనివారం పెంపుదల చేశారు. ఈ నెల 9వ తేదీ వరకు 300 క్యూసెక్కుల నీటిని సరఫరా చేయగా ప్రస్తుతం మరో 100 క్యూసెక్కుల నీటిని పెంచి మొత్తం 400 క్యూసెక్కుల నీటిని అధికారులు సరఫరా చేస్తున్నారు. రేగిడి, సంతకవిటి, జి.సిగడాం మండలాల్లో సాగునీటి అవసరాలకు సరిపడా నీటిని సరఫరా చేస్తున్నట్టు ఏఈ నితిన్ తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద 64.09 మీటర్ల మేర నీరు నిల్వ ఉంది. సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి 158 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్టు ఏఈ తెలిపారు.

130 మద్యం బాటిల్స్ సీజ్


సంతకవిటి: స్వాధీనం చేసుకున్న మద్యం నిల్వలతో పోలీసులు

సంతకవిటి: మండల పరిధి మండవకురిటి గ్రామంలో ఓ వ్యాపారి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 130 మద్యం బాటిల్స్‌ను సీజ్ చేసినట్టు ఏఎస్ఐ ఎం.వాసుదేవరావు తెలిపారు. శుక్రవారం రాత్రి గ్రామంలో జరిపిన దాడుల్లో అక్రమ నిల్వలు కలిగినట్టు గుర్తించామని, వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్టు ఏఎస్ఐ తెలిపారు.

సుఖాంతమైన కిడ్నాప్ కలకలం

- బాబామెట్టలో కిడ్నాపింగ్‌కి పాల్పడిన సుపారీ గ్యాంగ్ అరెస్ట్
- ముగ్గురు వ్యక్తులు, ఒక మహిళ, ఇద్దరు జువైనల్స్ అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ గోవిందరావు


వివరాలు వెల్లడిస్తున్న విజయనగరం డీఎస్పీ గోవిందరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: బాబామెట్టలో ఈ నెల ఆరో తేదీన కిడ్నాపింగ్‌కి పాల్పడిన సుపారీ గ్యాంగ్‌ను అరెస్టు చేసినట్టు విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు తెలిపారు. వారి నుంచి కిడ్నాపింగ్‌కు వినియోగించిన ఒక మోటారు సైకిల్, ఒక కారు, తులంన్నర బంగారు వస్తువులు, ఫిర్యాదుదారుడిని బెదిరించి, బలవంతంగా సంతకాలు చేయించిన ఖాళీ ప్రాంసరీ నోట్లు, ఖాళీ తెల్లకాగితాలు, ఆధార్ కార్డులు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బొందెలగూడెంకు చెందిన జోగ శివకిశోర్, జమ్మునారాయణపురానికి చెందిన కటకోటి సతీష్‌కుమార్ షాపును అద్దెకు తీసుకున్నాడు. మంచినీటి సరఫరా చేసే వ్యాపారం నిర్వహించాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య స్నేహం ఏర్పడింది. దీంతో బాధితుడు జోగ శివకిశోర్ నుంచి రూ.7 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. సకాలంలో అప్పును చెల్లించకపోవడంతో కిశోర్ కోర్టులో సతీష్‌పై కేసు వేశాడు. ఆర్థిక విషయాలపై ఇరువురి మధ్య గొడవలు జరగడంతో కిశోర్ తన వ్యాపారాన్ని బాబామెట్టకు మార్చేశాడు. దీంతో ఆగ్రహించిన సతీష్ కిశోర్‌ను కిడ్నాప్ చేసేందుకు అతని స్నేహితుడైన భీమిలికి చెందిన చుక్కా నూతన్ సాయికుమార్‌ను ఆశ్రయించాడు. అతనికి ఈ తరహా దందాలకు పాల్పడే భీమిలికి చెందిన బంగారి గణేష్ పరిచయం చేశాడు. వారి గ్యాంగ్‌తో కిడ్నాప్ చేసేందుకు రూ.7 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడన్నారు. సతీష్ ఫోన్‌పే ద్వారా సాయికుమార్‌కు దఫదఫాలుగా రూ.15వేలు, గణేష్‌కు రూ.15వేలు అడ్వాన్స్‌గా పంపినట్టు విచారణలో వెల్లడైందన్నారు. నిందితులు ఫిర్యాదుదారుడైన శివకిశోర్‌ను కిడ్నాప్ చేసేందుకు ఒక పథకాన్ని రూపొందించి, పథకం ప్రకారం ఫిబ్రవరి 6న బాబామెట్టకు గ్యాంగ్ సభ్యులు చేరుకున్నారు. ఫిర్యాదుదారుడు వాటర్ సరఫరా చేసేందుకు మారుతీ ఒమ్ని వ్యాన్‌లో బయలుదేరుతుండగా భీమిలికి చెందిన సురగల వరలక్ష్మి, ఇద్దరు జువైనల్స్ ఏపీ 35 ఏహెచ్ 2302 నంబరు గల మోటారు సైకిల్‌పై వచ్చి, మారుతీ ఒమ్ని వ్యాన్‌కు అడ్డంగా పడిపోయినట్టు నటించారు. నిందితులు ఏపీ 39 బిజి 2542 షిఫ్ట్ డిజైర్ కారులో వచ్చి, శివకిశోర్‌ను బలవంతంగా కారులో ఎక్కించుకుని, పూసపాటిరేగ మైలాన్ కంపెనీ వైపు తీసుకువెళ్లి, అక్కడ కత్తితో బెదిరించి, 15 ఖాళీ ప్రాంసరీ నోట్ల మీద, తెల్లకాగితాల మీద, ఆధార్‌కార్డు జెరాక్స్‌ల పైన సంతకాలు చేయించుకున్నారు. విచక్షణ రహితంగా చేతులతో ముఖం మీద కొట్టారు. ఆయన వద్ద ఉన్న రూ.1500 నగదు, తులంన్నర బరువు గల ఒక చైన్, రెండు ఉంగరాలను కూడా బలవంతంగా తీసుకుని, ఫిర్యాదును అక్కడే విడిచిపెట్టి వెళ్లిపోయారని డీఎస్పీ వివరించారు. బంగారి గణేష్ గతంలో ఆనందపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఒక హత్యకేసులో నిందితుడిగా ఉన్నాడు. అతనిపై రౌడీషీట్ ఉంది. నిందితులందరూ ఒక ముఠాగా ఏర్పడి, ఈ కిడ్నాప్‌కు ప్రయత్నించారని తెలిపారు. నిందితుల నుంచి మొబైల్ ఫోన్, రూ.1500 నగదు, అరతులం బరువు గల రెండు బంగారు ఉంగరాలు, తులం బరువు గల ఒక బంగారు చైన్, ఏపీ 35 ఏహెచ్ 2302 మోటారు సైకిల్, ఏపీ 39 బిజి 2542 షిఫ్ట్ డిజైర్ కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. బంగారు వస్తువులను భీమిలి ముత్తూట్ ఫైనాన్స్‌లో కుదువపెట్టి, కారును ఒక్క రోజుకు అద్దెకు తీసుకున్నట్టు విచారణలో నిందితులు అంగీకరించారని డీఎస్పీ వివరించారు. కేసును తీవ్రంగా పరిగణించిన ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలతో టూటౌన్ సీఐ కోరాడ రామారావు ఆధ్వర్యంలో ఎస్ఐలు దుర్గాప్రసాద్, రాజేష్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి, కిడ్నాప్ కేసు మిస్టరీని ఛేదించారు. ఇందులో క్రియాశీలకంగా పనిచేసిన అధికారులను ఎస్పీ అభినందించారని డీఎస్పీ తెలిపారు.